
# సత్యవాక్కు

# THE WORD OF TRUTH



క్రైస్తవ తెలుగు మాసపత్రిక

MAY - 2003

## సంక్షిప్త వార్తలు

2003 ఏప్రియల్ 11వ తేదీ శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా కొమ్మరలో సువార్తికుల సదస్సు జరిగెను. ఉభయ గోదావరి జిల్లాల నుండి వచ్చిన అనేక మంది సువార్తికులతో కొమ్మరలోని క్రీస్తు సంఘ ఆవరణ కళకళలాడెను. సోదరులు వి.చిన్నయ్య (కడలి) గారి ప్రార్థనతో సదస్సు ఆరంభమాయెను. తదుపరి "క్రైస్తవ జీవితంలో ప్రేమ యొక్క ప్రాముఖ్యత" అను అంశమును పలువురు సోదరులు చర్చించిరి.

సోదరులు యం.ప్రేమ్‌కుమార్ (చదలాడ), బుర్రేయోహాను (కురెళ్లగూడెం), యన్. మోజెస్ (కరుగోరుమిల్లి), డా॥. ఎస్.వి.రావ్. (మార్టేరు), బ్రదర్. రాజేంద్ర (తాడేపల్లి గూడెం), డి. రంగారావ్ (గొల్లివిల్లి) జాషువా గూటం గార్లు వాక్యమునుండి పలురీతులుగా ప్రేమయొక్క ప్రాధన్యతను గూర్చి బోధించిరి.

క్రైస్తవ జీవితంలో ప్రేమ ప్రాముఖ్యమైనది. దేవుడు ప్రేమా స్వరూపి; ప్రేమ లేనివాడు దేవుని ఎరుగడు (1 యోహాను 4:8). మానవుని దేవుడు తన స్వరూపమందు తనపోలిక చొప్పన చేసెను. అందువలన మానవుడు పాపము చేసినను దేవుడుతని ప్రేమించు చున్నాడు. ప్రేమలో ఆకర్షణ యున్నది. దేవుని ప్రేమను ప్రకటించుచు యేసు క్రీస్తు ఈలోకమునకు వచ్చెను. దేవుడు లోకమునెంతో ప్రేమించి తన అద్వితీయ కుమారుని లోకపాపములకై అనుగ్రహించెను. "ప్రియులారా మనము ఒకని నొకడు ప్రేమింతము; ఏలయనగా ప్రేమ దేవుని మూలముగా కలుగుచున్నది; ప్రేమించు ప్రతివాడును దేవుని మూలముగా పుట్టినవాడై దేవుని ఎరుగును" (1యోహాను 4:7). మరియు తన సహోదరుని ప్రేమించు వాడు వెలుగులో ఉన్నవాడు (1 యోహా 2:9).

ఈలోకంలో మనం యేమిమాట్లాడినా, యేమి చేసినా, యేమి కలిగి యున్నా, అదంతయు ప్రేమ పూర్వకమైనదై యుండాలి. ప్రేమలేని యెడల అదంతా వ్యర్థము (1కొరింథీ 13:1-2). "మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొందురని" యేసు చెప్పెను (యోహాను 14:15). దేవుని ప్రేమించువాడు ఆయన ఆజ్ఞలను గైకొన బాధ్యుడు. కాగా విశ్వాసము నిరీక్షణ ప్రేమ, ఈ మూడును నిలుచును. వీటిలో శ్రేష్టమైనది ప్రేమయే (1కొరింథీ 13:13) అని సోదరులు ఉపదేశించిరి.

సోదరులు యన్.ఏలియా (దేవగుప్తం) గారి ప్రార్థనతో సదస్సు

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

P.O. Box-80, Kakinada, A.P. 533 001

Ph : 0884 - 2363722

Editor :

**Joshua Gootam**

Pleading for Restoration of First Century Christianity

సంపుటిక 23 మే 2003 సంచిక 9


## ఆరాధనలో సంగీతము - 1

### (Music in Worship - 1)

పాటలు పాడుట ద్వారా దేవుని ఆరాధించు తరుణము క్రైస్తవ్యములో మాత్రమే యున్నది. పాటలు పాడుట యనునది సత్యారాధనలో ఒక భాగమై యున్నదని బైబిలు బోధించుచున్నది. అందువలన హెబ్రీ ఆరాధనలోను, క్రైస్తవ ఆరాధనలోను సంగీతమునకొక ప్రత్యేకస్థానముండుటలో ఆశ్చర్యము లేదు. దావీదు వ్రాసిన "కీర్తనల గ్రంథము" బైబిలు అంతటిలోను పెద్ద పుస్తకమై యున్నది. క్రైస్తవ్యారంభములో మేడగదిలోని ప్రభురాత్రి భోజన సందర్భములో పాటలు పాడుట మొదటిగా చెప్పబడెను. క్రీస్తును బోధించు చున్నందున క్రూరముగ హింసింపబడి చెరసాలలో వేయబడిన సువార్తికులు పౌలు, సీలా యనువారు, వారి కాళ్ళు, చేతులు బంధింపబడియుండగా కీర్తనలు

పాడిరి. చెరసాలలో వేయబడినను దేవునికి స్తుతిగానము చేయించ గల్గునట్టి దేవుడు తనకును కావలెనని ఆ చెరసాల అధిపతి ఆశించెను. అదే అపొస్తలుడైన పౌలు ఎఫెసీ 5:19లో, "కీర్తనలతోను, సంగీతములతోను, ఆత్మసంబంధమైన పాటలతోను హెచ్చరించుచు, మీ హృదయములలో ప్రభువును గూర్చి పాడుచు కీర్తించుడి" యని క్రైస్తవుల కాజ్ఞాపించెను. సంఘమంతయు ఏకముగా కూడి వచ్చినప్పుడు ఒకని నొకడు కీర్తనలతోను, సంగీతములతోను, ఆత్మ సంబంధమైన పాటలతోను హెచ్చరించుకొనవలయునని అతడు సూచించుచున్నాడు.

కీర్తనలు, సంగీతములు, పాటలు అనునవి వివిధరకములైన పాటలే అయినను, అవన్నియును ఆత్మీయములై ఒకనిని దేవుని సన్నిధికి తెచ్చునవిగా యుండవలయును. మరియు ఆ సంకీర్తనము హృదయములో జరుగుచు దేవుని మహిమ పరచవలెను. కొలస్స 3:16లో, "సంగీతములతోను, కీర్తనలతోను, ఆత్మసంబధమైన పద్యములతోను ఒకని నొకడు బోధించుచు, బుద్ధిచెప్పచు కృపాసహితముగా మీ హృదయములలో దేవుని గూర్చి గానము చేయుడి" యని పౌలు మరల చెప్పుచున్నాడు. కాబట్టి దైవారాధనలో పాటలు పాడుట యనునది దేవుని మహిమ పరచుటకును, ఆరాధించుటకును, కూడుకొనినవారు ఒకరికొకరు బోధించుటకును, బుద్ధిచెప్పకొనుటకును ఉద్దేశింపబడినది.

## సంగీతము రెండు విధములు

పాటలు పాడుట ద్వారా దేవుని ఆరాధించు సమయమున వాయిద్యములను కూడ ఉపయోగింపవచ్చునా? యను ముఖ్య ప్రశ్న మీకు రావచ్చును. సంగీతము గాత్రము, జంత్రము (Vocal & Instrumental) అని రెండు విధములు. క్రైస్తవారాధనలో దేవుడు గాత్రమునే, లేదా మానవ స్వరగానమునే కోరినట్లగుపడుచున్నది. అపొస్తలులుగాని, ఆదిమ క్రైస్తవులుగాని ఆరాధనలో వాయిద్యములనుపయోగించినట్లు క్రొత్త నిబంధనలో గాని, చరిత్రలో గాని ఎక్కడ కన్పించుటలేదు. క్రైస్తవారాధనలో వాయిద్యములను మానవులే ప్రవేశపెట్టిరిగాని దేవుని

వాక్యము కాదు. అయితే "క్రీస్తు బోధయందు నిలిచి యుండక దానిని విడిచి ముందుకు సాగు ప్రతివాడును దేవుని అంగీకరింపని వాడు" అని 2యోహాను, 9వ వచనములో వ్రాయబడి యున్నది.

క్రొత్త నిబంధన గ్రంథము సంపూర్తిగా లిఖింపబడిన కొన్ని వందల సంవత్సరముల తరువాత క్రైస్తవారాధనలోనికి కేథలిక్కులు వాయిద్యములను ప్రవేశపెట్టిరియని చరిత్ర చెప్పచున్నది. ఇంచుమించు క్రీ॥శ॥ 670 సం॥లో పోపు వైటాలియన్ అనునతడు ఐరోపాలోని కొన్ని కేథలిక్ గుడులలో ఆర్గన్ అను వాయిద్యము ప్రవేశపెట్టినట్లు American Encyclopaedia చెప్పచున్నది. క్రీస్తు సంఘము స్థాపించబడిన 670 సంవత్సరముల తరువాత మనుష్యులు ప్రవేశపెట్టిన ఈ పద్ధతిని దైవోపదేశమువలె ఇప్పటి కింకను అనేకులు అనుసరించుట విచారకరము. అందుకే మనుష్యులు కల్పించిన పద్ధతులను బట్టి మనము దేవుని ఆరాధించిన యెడల అట్టి ఆరాధన వ్యర్థమని యేసుక్రీస్తు ముందుగనే మనలను హెచ్చరించెను (మత్తయి 15:7-9).

## దావీదు మాదిరి ?

దేవుని స్తుతించుటకు దావీదు వాయిద్యముల నుపయోగించెను గదా అట్లే మనమెందుకు చేయరాదు అని మీరడుగవచ్చును. కీర్తనలు 150:3-4లో "స్వర మండలముతోను, సితారాతోను ఆయనను స్తుతించుడి. తంబురతోను, నాట్యముతోను ఆయనను స్తుతించుడి" అని అతడు చెప్పినందున ఈనాడు మనము ఆరాధనలో ఎందుకు నాట్యమాడరాదు? యూదుల ఆరాధనలో సాంబ్రాణి పొగలు, పశుబలులవలె, ప్రార్థన చేయుట కూడ ఒకభాగమై యుండెను. క్రొత్త నిబంధన మనము ప్రార్థన చేయువలెనని చెప్పినందున, సాంబ్రాణి పొగలను, పశుబలులను పరిత్యజించితిమి. దావీదు, మోషే ధర్మశాస్త్ర ప్రకారము జీవించి, మరణించెను. "మోషే ధర్మశాస్త్రము దేనికిని సంపూర్ణ సిద్ధిని కలుగజేయలేదు. గనుక అంతకంటె శ్రేష్ఠమైన నిరీక్షణ, (అనగా క్రొత్త నిబంధన) దాని వెంట ప్రవేశపెట్టబడెను" అని హెబ్రీ 7:19

చెప్పుచున్నది. మోషే ధర్మశాస్త్రము అమలులో యున్నపుడు దేవుడు బహు భార్యాతత్వమును, సులభ విడాకుల పద్ధతిని, వాయిద్య సంగీతము సహించెను. అయితే యేసుక్రీస్తు మోషే ధర్మశాస్త్రమును మేకులతో సిలువకు కొట్టి దానిమీద చేవ్రాతను తుడిచివేసి, దానిని ఎత్తివేసెను అని కొలస్స 2:14లో వ్రాయబడి యున్నది. గనుక "మీలో ధర్మశాస్త్రము వలన నీతిమంతులని తీర్చబడువారెవరో వారు క్రీస్తులో నుండి బొత్తిగా వేరుచేయబడి యున్నారు. కృపలో నుండి తొలగిపోయి యున్నారు" అని పరిశుద్ధాత్ముడు గలతీ 5:4లో పలుకుచున్నాడు. "కావున సహోదరులారా, మనము దేవుని కొరకు ఫలమును ఫలించునట్లు మృతులలో నుండి లేపబడిన క్రీస్తు అను వేరొకని చేరుటకై మీరును ఆయన శరీరము ద్వారా ధర్మశాస్త్రము విషయమై మృతులైరి" యని రోమా 7:4 చెప్పుచున్నది. మనము మృతులలో నుండిన మోషే, దావీదులనుగాక, మృతులలో నుండి లేపబడిన యేసుక్రీస్తును ఆరాధించువారము. ఆరాధనలో వాయిద్యముల నుపయోగించిన యెడల దేవుని గాక మానవునే మనము గౌరవించిన వారమగుదుము.

## క్రొత్త నిబంధన బోధ

ఆరాధనలో దేవుడు కోరునట్టి సంగీతమును గూర్చి క్రొత్త నిబంధన ఏమి చెప్పుచున్నదో ఆ వాక్యము లన్నిటిని మనమిప్పుడు చూద్దాం. మీ బైబిలు గ్రంథమును దయచేసి తెరచినయెడల మన మతి వినయముతో లేఖనములను పరిశీలిద్దాం.

మత్తయి 26:30; మార్కు 14:26 "అంతట వారు కీర్తనపాడి ఒలీవ కొండకు వెళ్లిరి".

అపొ.కా. 16:25 "అయితే మధ్య రాత్రివేళ పౌలును, సీలయు దేవునికి ప్రార్థించుచు, కీర్తనలు పాడుచుండిరి".

రోమా 15:9 "ఈ హేతువు చేత అన్యజనులలో నేను నిన్ను స్తుతింతును. నీ నామ సంకీర్తనము చేయుదును".

1 కొరింథీ 14:16 "కాబట్టి ఆత్మతో పాడుదును, మనస్సుతోను

పాడుదును".

ఎఫెసీ 5:19 "ఒకని నొకడు కీర్తనలతోను, సంగీతములతోను, ఆత్మసంబంధమైన పద్యములతోను హెచ్చరించుచు మీ హృదయములలో ప్రభువును గూర్చి పాడుచు కీర్తించుడి".

కొలస్స 3:16 "సంగీతములతోను, కీర్తనలతోను, ఆత్మసంబంధమైన పద్యములతోను ఒకనినొకడు బోధించుచు, బుద్ధిచెప్పుచు, కృపాసహితముగా మీ హృదయములలో దేవుని గూర్చి గానము చేయుచు .... క్రీస్తు వాక్యమును మీలో సమృద్ధిగా నివసింపనీయుడి".

హెబ్రీ 2:12 "నీ నామమును నా సహోదరులకు ప్రచురపరతును, సంఘము (సమాజము) మధ్య నీ కీర్తిని గానము చేతును".

హెబ్రీ 13:15 "ఆయన నామమును ఒప్పుకొనుచు జిహ్వాఫలము (Fruit of the lips) అర్పించుదము".

యాకోబు 5:13 "మీలో ఎవనికైనను శ్రమ సంభవించెనా? అతడు ప్రార్థన చేయవలెను. ఎవనికైనను సంతోషము కలిగెనా? అతడు కీర్తనలు పాడవలెను".

క్రొత్త నిబంధనలో కన్పడుచున్న ఈ వాక్యములను బట్టి దేవుడు ఆరాధనలో కోరునట్టి సంగీతము స్వరగానము అని వ్యక్తమయినది. వాయిద్యముల నుపయోగించుట కనుకూలముగ మానవులెన్ని చెప్పినను, మనము ప్రభువును గూర్చి హృదయములలో పాడుచు కీర్తించుచున్న యెడల ఆయనను ఆత్మతోను, సత్యముతోను ఆరాధించుచున్నామను సంగతిని ఎవరు ప్రశ్నింపరు. వాయిద్యములను విడనాడి ఆరాధనలో పాటలు పాడుట వలన మనము సత్యవాక్యమున కనుకూలముగ నడుచు కొనుచున్నామని పరిశుద్ధాత్మావేశపు గ్రంధకర్తలు చెప్పుచున్నారు.

కొలస్స 3:17లో "మాటచేతగాని, క్రియచేతగాని మీరేమి చేసినను ప్రభువైన యేసుద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు సమస్తమును ఆయన పేరట చేయుడి" యని వ్రాయబడియున్నది. భగవత్సృష్టియు, దైవానుమతి బడసినట్టియు స్వర(గాన)ము మానవుని

ఉచ్ఛస్థితిలోనికి తెచ్చును. ఇది క్రీస్తు నామమున లేక ఆయన అధికారము వలన జరుపబడవచ్చును. దేవుని నారాధించుటలో వాయిద్యముల నుపయోగించిన యెడల మానవసృష్టియగు వాయిద్యములే పైకెత్తబడును. క్రొత్త నిబంధన, ఆరాధనలో వాయిద్యోపకరణమున కెన్నడును తావీయలేదు. గనుక అది తప్పక మానవ కల్పితమే. అయితే దైవారాధనలో అది వ్యర్థము (మత్తయి 15:9).

దేవుని నారాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధింప వలెనని ఆయన ఇప్పుడు కోరుచున్నాడు. వాక్య ప్రకారములేని ఆరాధనాంశములన్నియును దేవుని యధార్థముగ ఆరాధించుటకు ఆటంకపరచును. గనుక మీరు చేయు ఆరాధనను ఒక్కమారు దైవవేదమును బట్టి పరిశీలించుట మంచిది. పరిశీలించుటయేగాక సవరించుకొనుట ఎంతో ఉత్తమమైనది.

'సత్యవాణి' రేడియో కార్యక్రమాలను ప్రతి ఆది, సోమ, బుధ గురువారాల్లో మధ్యాహ్నం 2:00 గంటలకు రేడియో శ్రీలంక ద్వారా వినండి. మీ బంధుమిత్రులకు విన్పించండి!!

# రాతి నేలను పడిన విత్తనము

## మత్తయి 13: 18-23

యేసు ప్రభువు విత్తువాని ఉపమానము చెబుతు మీరేమి వినుచున్నారో జాగ్రత్తగా చూచుకొనుడి యని చెప్పారు. దేవుని వాక్యము ప్రకటింప బడుచుండగా దానిని వినువారు నాలుగు రకములైన హృదయములను కలిగియుంటారు. "ఎవడైనను రాజ్యమును గూర్చిన వాక్యము వినియు గ్రహింపక యుండగా, దుష్టుడు వచ్చి వాని హృదయములో విత్తబడిన దానిని యెత్తికొని పోవును; త్రోవ ప్రక్కన విత్తబడిన వాడు వీడే" యని ఆయన చెప్పారు (మత్తయి 13:19).

### ఉపమాన భావం

విత్తువాడు విత్తుచుండగా కొన్ని రాతినేలను పడెను. "రాతి నేలను విత్తబడినవాడు వాక్యము విని వెంటనే సంతోషముతో దాని నంగీకరించు వాడు. అయితే అతనిలో వేరు లేనందున అతడు కొంతకాలము నిలుచును గాని వాక్యము నిమిత్తము శ్రమయైనను హింసయైనను కలుగగానే అభ్యంతర పడును" (మత్తయి 13:21). ఈ విత్తనములు పడిన హృదయం రాతినేల వంటిది. అడుగు భాగమున గట్టి బండవలె యుండి పైన మట్టుకు మట్టిపొర కొంచెం ఉంటాది. రాతి నేలను పడిన విత్తనములు, "అక్కడ మన్ను లోతుగా ఉండనందున అవి వెంటనే మొలిచెనుగాని సూర్యుడు ఉదయించినప్పుడు అవి మాడి వేరు లేనందున ఎండిపోయెనని" యేసు ప్రభువు చెప్పారు (మత్త 13:5).

రాతి నేల వంటి హృదయము గలవారు వాక్యమును వింటారు. మనము రక్షింపబడాలంటే యిది ప్రధమ ఘట్టము: "కాగా వినుట వలన విశ్వాసము కలుగును, వినుట క్రీస్తును గూర్చిన మాట వలన కలుగును" (రోమా 10:17). అయితే మనం వినుటతోనే సరిపోదుగాని, మనమేలాగు వినుచున్నామో జాగ్రత్తగా చూచుకోవాలి. రాతి నేల వంటి

హృదయము గల వారు వినునప్పుడు సంతోషముతో వెంటనే అంగీకరిస్తారు. ఇట్టి వారు సత్యానికి స్వాగతం పలుకుతారు. సత్య వాక్యం ప్రకటించబడుచుంటే వారు వింటారు, సంతోషంతో అంగీకరిస్తారు. త్రోవ ప్రక్కన పడిన విత్తనములవంటి హృదయముగల వారి కంటె వీరి పరిస్థితి కొంతమట్టుకు మెరుగైనదే. గాని వేరు లేనందున వారిలో మొలకెత్తిన ఈ బీజములు ఎండిపోతాయి. వీరు కొంచెము కాలము నమ్మి, శోధన కాలమందు తొలగిపోవుదురు.

ఎఫెసులోని సంఘము యొక్క పరిస్థితి ఇట్లుండెను: "నీవు సహనము కలిగి నా నామము నిమిత్తము భారము భరించి, అలయలేదని నేనెరుగుదును. అయినను మొదట నీ కుండిన ప్రేమను నీవు వదలితివని నేను నీమీద తప్పు ఒకటి మోపవలసి యున్నది. నీవు ఏ స్థితిలోనుండి పడిపోతివో అది జ్ఞాపకము చేసికొని మారు మనస్సు పొంది ఆ మొదటి క్రియలను చేయుము. అట్లుచేసి నీవు మారు మనస్సు పొందితేనే సరి; లేని యెడల నేను నీయొద్దకు వచ్చి నీ దీప స్తంభమును దాని చోటనుండి తీసివేతునని" యేసు ప్రభువు చెప్పారు (ప్రకటన 2:3-5).

## రాతి నేల వంటి హృదయం

రాతి నేల వంటి హృదయము గలవాడు భావోద్రేక పూరితుడు. అతడు వెంటనే సంతోషిస్తాడు, వెంటనే కోపపడతాడు, ఏమి చేసినా వెంటనే చేస్తాడు. కేవలం భావోద్రేక పూరిత చర్యలు ఎక్కువ కాలం నిలబడలేవు. గాని మన భావాలు, అంచనాలు, తీర్పులు బైబిలును బట్టి సమతుల్యం చేయబడి నడిపించబడాలి.

రాతి నేల వంటి హృదయం గలిగిన క్రైస్తవుడు వేరు లేనట్టివాడు. రాతి నేలపై భాగమున ఉండు మట్టి స్వల్పమైనదే. అందువలన వేరు లోపలికి ప్రవేశింప లేదు. ఇటువంటి హృదయంగల మనుష్యుడు వాక్యం వినడంలో సంతోషం వ్యక్తపరచినను అది కొంచెము కాలము మట్టుకే యుంటాది. అతని హృదయం నిరంతరం రాడుగా తయారై యుంటాది. అతడు వినిన వాక్యం లోపలికి, లోతుగా ప్రవేశించలేదు; అందువలన

అది ఫలించలేదు.

మనము రాతి నేల వంటి హృదయము కలిగి యుండక క్రీస్తునందు వేరు పారి యుండాలని ఆయన కోరుచున్నారు. పరిశుద్ధాత్ముడు ఇట్లు చెబుతున్నాడు : "కావున మీరు ప్రభువైన క్రీస్తు యేసును అంగీకరించిన విధముగా ఆయన యందు వేరు పారినవారై యింటివలె కట్టబడుచు, మీరు నేర్చుకొనిన ప్రకారముగా విశ్వాసమందు స్థిరపరచబడుచు, కృతజ్ఞతాస్తుతులు చెల్లించుట యందు విస్తరించుచు ఆయన యందు నడుచుకొనుడి" (కొలస్స 2:6, 7).

రాతి నేల వంటి హృదయం గలవాడు వాక్యమును విని, కొంత కాలము మట్టుకు నమ్ముతాడు. మన విశ్వాసము కొంత కాలము మట్టుకే యుంటే అది నిష్ఫలమైనది. "ఈ జీవిత కాలము మట్టుకే మనము క్రీస్తు నందు నిరీక్షించు వారమైన యెడల మనుష్యులందరి కంటె దౌర్భాగ్యులమై యుందుము అని అపొ.పౌలు చెప్పుచున్నాడు (1 కొరి 15:19). దేవుని వాక్యమును సంతోషముతో అంగీకరించినవాడు విశ్వాసము నందు ఎడతెగక నిలిచి యుండాలి. "అంతము వరకు సహించినవాడు రక్షింపబడునని" యేసు ప్రభువు చెప్పారు (మత్త10:22).

## వేరు పారి స్థిరపడలి

రాతి నేల వంటి హృదయము గలవాడు వాక్యము విని అంగీకరించి కొంత కాలము నిలుచును గాని వాక్యము నిమిత్తము శ్రమయైనను హింసయైనను కలుగగానే అభ్యంతరపడును, లేదా తొలగిపోవును. ఇతని హృదయములో నుండి అపవాది వాక్యమును ఎత్తుకొని పోలేదు గాని అది ఫలించకుండా అంతరంగికముగాను బహ్యాముగాను కొంత వ్యతిరేక వాతావరణన్ని సృష్టించింది. ఇతడు విశ్వాసములో వేరు పారి స్థిరపడనందున శోధనలు రాగానే తొలగిపోతాడు. గాని "క్రీస్తు యేసు నందు సద్భక్తితో బ్రదుక నుద్దేశించు వారందరు హింస పొందుదురు" (2 తిమో 3:12). హింసలు రాగా సహించి విశ్వాసములో నిలిచినవాడే ధన్యుడౌతాడు. అట్టి వారితో ప్రభువు,

"నీ క్రియలను నేనెరుగుదును; నీకున్న శక్తి కొంచెమై యుండినను నీవు నా వాక్యమును గైకొని నానామము ఎరుగననలేదు. ఇదిగో తలుపు నీయెదుట తీసియుంచి యున్నాను; దానిని ఎవడును వేయనేరడని" చెప్పను (ప్రక 3:8).

మొదట్లో పేతురుకున్న హృదయం ఇట్టిదే, కొంచెం హింస కలుగగానే అతడు ప్రభువును ఎరుగనన్నాడు. ఈరోజులలో క్రైస్తవులమని పేరు పెట్టుకొన్నవారు అనేక విషయాలలో ప్రభువును ఎరుగనను చున్నారు. "దేమా యిహలోకమును స్నేహించి నన్ను విడిచి వెళ్లెనని" పౌలు చెప్పాడు (2 తిమో 4:10). కొందరు క్రీస్తు సైన్యంలో సైనికునిగా యున్నట్లు కనబడడానికే చేరతారు గాని సంఘర్షణ చెలరేగగానే పారిపోతారు. అట్టి వారిని గూర్చి ప్రభువు సిగ్గపడుచున్నారు.

క్రైస్తవ జీవితం వేరు పారి స్థిరపడాలంటే శోధనలు అవుసరం. విత్తనముల మొలకెత్తి మంచి మొక్కలుగా పెరగాలంటే సూర్యుని వేడి వాటి కవుసరం. గాని ఆ విత్తనములు పడినచోట రాతి నేల అయితే సూర్యుని వేడికి అవి ఎండిపోతాయి. అట్లే క్రైస్తవునికి కలిగే శోధనల వలన అతడు విశ్వాసంలో బలపడతాడు, లేదా వాటి వలననే అతడు ఎండిపోయి తొలగిపోతాడు. అపొ.పౌలు క్రీస్తు కొరకు అనేక హింసలు పొందాడు గాని అప్పడే అతడు సంతోషముతో బలపడ్డాడు. (2 కొరింథీ 12:10).

నీకున్న హృదయమెట్టిది? నీవు వినుచున్న వాక్యాన్ని యేమి చేస్తున్నావు? యేసు ప్రభువునందు విశ్వాసముంచుము, పాపముల విషయమై మారు మనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొంది క్రీస్తు కొరకు ఫలములు ఫలించును.

# ప్రేమ

## (Love)

"ఉపదేశసారమేదనగా, పవిత్ర హృదయమునుండియు, మంచి మనస్సాక్షినుండియు, నిష్కపటమైన విశ్వాసము నుండియు కలుగు ప్రేమయే" (1 తిమోతి 1:5).

ప్రేమచాల ప్రాముఖ్యమైన అంశము. అది జీవితములో చాలా శ్రేష్ఠమైనది. కాగా విశ్వాసము, నిరీక్షణ, ప్రేమ ఈమూడును నిలుచును. వీటిలో శ్రేష్ఠమైనది ప్రేమయే. (1 కొరింథీ 13:13). ప్రేమతో క్రైస్తవ జీవితము ముడిపడియున్నది. దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. (యోహాను 3:16). ఈ వాక్యము బైబిలులో బంగారు వాక్యమై యున్నది. విశ్వాసమునకు మూలాధారము దేవుడే. నిరీక్షణకు అయనే ఆధారము. దేవుడు ప్రేమయై యున్నాడు. క్రైస్తవ కృపలలో ముఖ్యమైనది ప్రేమ. దీనిమూలము దేవుడు. ప్రేమ యొక్క ప్రమాణము యేసుక్రీస్తు. దీని యొక్క పరిచర్య విశ్వాసమై యున్నది. విధేయత, దీనియొక్క పరీక్ష అయియున్నది. మనము దేవుని ప్రేమించుచున్నామంటే, మొదట ఆయనే మనలను ప్రేమించెను గనుక (1 యోహాను 4:10). ప్రేమలేని వాడు, దేవునిని తెలుసుకొనలేడని గ్రహింపగుచున్నది. మనలను, దేవుడు ప్రేమించుచున్నాడని తెలుసుకొనినపుడే, ఇతరులను మనం ప్రేమింప గలము. లోకములోనున్న వారికి, దేవునిని గూర్చి తెలుపుటకు ముందు, మానవులకొరకు దేవుడు చేసిన దేమిటో తెలుపవలెను.

### నిజ జీవితంలో ప్రేమ

ప్రేమతో నడుచు కొంటున్నామంటే, మనము దినదినము దేవునితో నడుచుకొంటున్నామని అర్థము. కల్వరిసిలువకు క్రీస్తు వెళ్లకముందు, పేతురు క్రీస్తును గూర్చి మూడుసార్లు బొంకినాడు. దీనికి గాను పేతురు వెలుపలికి పోయి, సంతాప పడియేడ్చెను. యోహాను సువార్త 21వ అధ్యాయమున చదివినపుడు, పేతురును, యేసు సరిదిద్దిన విధానమును చూడగలము. యేసుకూడ పేతురును అదేప్రశ్నను మూడు సార్లు అడిగెను. అదేమనగా - "నీవు నన్ను ప్రేమించు చున్నావా"? ఈ ప్రశ్నకు పేతురు

గుండె పగిలిన వాడాయెను. యేసు పేతురును తృణీకరించ లేదు, బెదిరించలేదు మరియు శిక్షింపలేదు. పేతురు ఆదివారం ప్రార్ధనకు వెళ్లి ఎక్కువ చందా వేయమని యేసు చెప్పనూలేదు. అలాగు చేయుట చాలా తేలికైన పని అయిన యుండును. "నీవు నన్ను ప్రేమించుచున్నావా?" అనునది మన జీవితంలో చాలా ముఖ్యమైన ప్రశ్నయై యున్నది. మనము యేసును నిజముగా ప్రేమించుచున్నామా? ఈ ప్రశ్న పేతురును కొంచెం ఇరకాటంలో పడేసింది. మనలను కూడ ఈ ప్రశ్న కొంచెం యిరకాటంలో పడవేయును. మనము ప్రేమలో ఎదుగుచున్నమా? "మీరు ఒకరినొకరు ప్రేమింపవలెనని మీకు క్రొత్త ఆజ్ఞను ఇచ్చుచున్నాను". నేను మిమ్మును ప్రేమించినట్టే, మీరును ఒకరినొకరు ప్రేమింపవలెను. మీరు ఒకని యెడల నొకడు ప్రేమగలవాడై యున్న యెడల దీనిని బట్టి, మీరు నా శిష్యులని అందరును, తెలుసుకొందురనెను" (యోహాను 13:34, 35). క్రీస్తు యొక్క శిష్యరికమునకు ప్రేమ చిహ్నముగా యున్నది. యేసువలె ప్రేమించుట అనునది క్రొత్త ఆజ్ఞ. కేవలము పెదవులతో ప్రేమించుచున్నామని చెప్పక, హృదయములో నుండి ఆమాటలను మనము బహిర్గతము చేయవలెను.

## గృహములో ప్రేమ

వివాహములో జత పరచ బడబోవువారికి పౌలు కూడ యేసు ప్రేమించిన విధముగా ప్రేమింపవలెనని చెప్పెను. (ఎఫెసీ 5:25-33). మన గృహములలో మనము ఎన్నో విషయములలో ఓడిపోతున్నామంటే, మనలో ప్రేమహీనతే కారణము. మనము సహోదరులను ప్రేమింపవలసి యున్నది (రోమా 12:9,10). "మనకు కనబడుచున్న సహోదరులను ప్రేమింపకుండా, మనకు కనబడని దేవునిని ప్రేమించుచున్నామని ఏలాగు చెప్పగలము? అని 1 యోహాను 4:19-21లో, యోహాను ప్రశ్నించెను. దేవునితో మనకు గల ప్రేమబంధము, మన అనుదిన జీవితములో ఒక మూల సూత్రమై యుండవలెను. ప్రేమ మనలను గెలిపించును. అప్పడు మనము ప్రేమ గలవారమగుదుము.

క్రీస్తు ప్రేమ మనలను పరిపాలించును. క్రీస్తు ప్రేమ మనలను ఆత్మీయముగా ఎదుగుటలో సహాయపడును. పరిశుద్ధాత్మ ద్వారా దేవుని

ప్రేమ మనలో కుమ్మరింపబడియున్నది. (రోమా 5:5-8). క్రైస్తవ్యము, ప్రేమతో, విశ్వాసముతో మనుషుల కొరకు పనిచేయును. (గలతీ 5:6). తీగె, ద్రాక్షవల్లి ఉపమానములో యేసు ఈ విధముగా చెప్పెను. "నాయందు మీరు నిలిచియుండుడి". మీ యందు నా మాటలు నిలిచి యుండనియుడి." "నా ప్రేమ యందు నిలిచి యుండుడి". "మీరు నన్ను ప్రేమించినట్లయితే, నా ఆజ్ఞలు గైకొనుడి. (యోహాను 14:15, 23). క్రైస్తవ జీవితం అంత తేలికైంది కాదు. అన్ని సమయములలోను మనం ఊహించునట్టుగా, సంతోష భరితమైంది కాదు. కాని అది ప్రేమతో కొనసాగుచుండును. మనలోనున్న ప్రేమనుబట్టి, జనులు మనలో క్రీస్తును చూడగలరు.

బైబిలు బోధించు ప్రేమ చాలా కఠినమైన ప్రేమ. క్రమ శిక్షణయే, దేవుని యొక్క స్వభావము. ప్రేమగల దేవుడు ఇచ్చువాడు, మరియు త్యాగము చేయువాడు. అప్పుడు యేసు తన శిష్యులను చూచి, ఎవడైనను నన్ను వెంబడింప గోరినయెడల, తన్నుతాను ఉపేక్షించుకొని, తన సిలువనెత్తుకొని నన్ను వెంబడింపవలెను. తన ప్రాణమును రక్షించు కొన గోరువాడు దానిని పోగొట్టు కొనును. నా నిమిత్తము, తన ప్రాణమును పోగొట్టుకొనువాడు, దాని దక్కించుకొనును. (మత్తయి 16:24,25). ప్రేమ శశ్వితాకాలముండును (1 కొరింథీ 13:8) ఎన్నటికి ఓడిపోదు. "దేవుడు, ప్రేమా స్వరూపి యైయున్నాడు. ప్రేమయందు నిలిచియుండు వాడు దేవునియందు నిలిచియున్నాడు. దేవుడు వానియందు నిలిచి యున్నాడు." (1 యోహాను 4:16).

## ప్రేమ అనగా ఏమిటి ?

ఈనాడు లోకమునకు కావలసినది మధురమైన ప్రేమయే. ప్రతి విషయమునకు ప్రేమయే జవాబుదారి. రాత్రింబగళ్లు ప్రేమను గురించి వింటుంటాము. కాని నిజమైన ప్రేమ మనలో ఉన్నదా? లోకములో యుద్ధము జరుగుతున్నది. హింస పెచ్చు మీరుతున్నది. లోకము చాలా ప్రమాదములో యున్నది. విడాకులు కామాతురత వలన జరుగుచున్నవి. ఒక అంచానా ప్రకారము నాస్తికుల మధ్య కంటే, సంఘ సభ్యుల మధ్య

ఎక్కువుగా విడాకులు జరుగుతున్నవని తేలింది. గర్భస్రావములు, మత్తు పానీయములు, నేరములు, హత్యలు అవినీతి, ఇత్యాది పాపములు ప్రబలుతున్న కాలములో ప్రేమహీనత ప్రబలుతున్నది.

ఎలాంటి షరతులు లేని ప్రేమ సార్వత్రికమైనది. దేవుడు వెలుగైయుండెను (1 యోహాను 1:5). వెలుగునకు చీకటితో పొత్తు కుదరదు. క్రీస్తు యొక్క బల్లలో సాతానుతో కలిసి నీవు పాలుపొందలేవు. (1 కొరింథీ 10:21). క్రీస్తుకు బెలియాలుతో సంబంధమేమి? (11 కొరింథీ 6:14-16). మనవుల దేవునితో సహవాసము కలిగి యుండాలంటే, వెలుగులో తప్పక నడవ వలెను (1 యోహాను 1:7). ఆయన కుమారుని సిలువలో తప్ప, మనలను దేవుడు మరియొక చోట అంగీకరింపడు, క్షమింపడు.

దేవుని వాగ్దానములన్నియు షరతులతో కూడినవే. ఒకడు బహుమానమును పొంద వలెనంటే, రెండు సంగతులు అందులో గలవు. 1) బహుమాన మిచ్చు వాడు. 2). బహుమానం పొందువాడు (1కొరింథీ 9:25). బహుమానం పొందటానికి ఇష్టంలేనివానికి, మనం బహుమానం ఇవ్వలేము. పొందనర్హత లేకున్నను, బహుమానం పొందువాడు ఉచితముగా పొందును. మనము అర్హులమని, దేవుడు మనలను ప్రేమించుట లేదుగాని, మనము అర్హులము కాకున్నను, దేవుడు మనలను ప్రేమించుచున్నాడు. మన కందరికి దేవుడు రక్షణను ప్రసాదించుటకు ఇచ్ఛయించుచున్నాడు. (11 పేతురు 3:9, 1 తిమోతి 2:4).

దేవుడు మనకు రక్షణను బలవంతముగా ఇచ్చుటలేదు. మనము దానిని సంపాదింపలేము. కాని రక్షణను తిరస్కరించకూడదు. దేవుని కృప నిర్దోషమైనది. నిష్కపటమైనది. అది షరతులతో కూడినది. క్రీస్తు మరణము మన జీవితానికి వ్యర్థము కానివ్వరాదు. మనము ప్రతి దినము దేవుని కృపకు విధేయుల మగుదము గాక.

- అద్దంకి సత్యవర్ధన రావు, సబ్బపాడు.

# పెండ్లాడ గోరేవారికి కొన్ని సలహాలు

## (Some Advice For those planning to get Married)

వివాహాన్ని దేవుడే నియమించారు. అది అతి పురాతన సంస్థ. "దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను; దేవుని స్వరూపమందు వాని సృజించెను; స్త్రీని గాను పురుషుని గాను వారిని సృజించెను. దేవుడు వారిని ఆశీర్వదించెను; ఎట్లనగా - మీరు ఫలించి అభివృద్ధి పొంది విస్తరించి, భూమిని నిండించి దానిని లోబరచుకొనుడి" (ఆది.కా. 1:27-28).

యువతీ యువకులు వయస్సు వచ్చుసరికి వివాహ మాడి భార్య భర్తలుగా యుండాలని పిల్లలను కనాలని కాంక్ష కలిగి యుందురు. అట్టి వారికి దిగువ కొన్ని సలహాలను ఇయ్యగోరుదును.

మొదటిగా వివాహాన్ని గూర్చి దీర్ఘంగా ఆలోచించు. వివాహమంటే యేమిటో, నీ వెవరిని వివాహ మాడ గోరుచున్నావో ఆ వ్యక్తిని గూర్చి, మరియు ఆ వ్యక్తితో నీజీవిత కాలమంతయు గడపడాన్ని గూర్చి ఆలోచించు. యేసు యొక్క మాటలు వినుము : " ఆయన - సృజించిన వాడు ఆది నుండి వారిని పురుషునిగాను స్త్రీని గాను సృజించెననియు ఇందు నిమిత్తము పురుషుడు తలిదండ్రులను విడిచి తన భార్యను హత్తుకొనును, వారిద్దరు ఏకశరీరముగా ఉందురని చెప్పెననియు మీరు చదువలేదా? కాబట్టి వారికను ఇద్దరు కాక ఏకశరీరముగా ఉన్నారు. గనుక దేవుడు జతపరిచిన వారిని మనుష్యుడు వేరు పరచ కూడదని చెప్పెను" (మత్తయి 19:4-6).

రెండవదిగా, క్రైస్తవుని క్రైస్తవురాలినే పెండ్లి చేసికొనుము. ఆ వ్యక్తి క్రీస్తు సంఘములో యుంటే మరీ మంచిది. అపొస్తలుడైన పౌలు ఇట్లు చెప్పాడు : "మీరు అవిశ్వాసులతో విజోడుగా ఉండకుడి, నీతికి దుర్నీతితో ఏమి సాంగత్యము? వెలుగునకు చీకటితో ఏమి పొత్తు? క్రీస్తునకు బెలియాలుతో ఏమి సంబంధము? అవిశ్వాసితో విశ్వాసికి పాలెక్కడిది? దేవుని ఆలయమునకు విగ్రహములతో ఏమి పొందిక? మనము జీవము

గల దేవుని ఆలయమై యున్నాము; అందుకు దేవుడీలాగు సెలవిచ్చు చున్నాడు - నేను వారిలో నివసించి సంచరింతును; నేను వారి దేవుడనై యుందును వారు నా ప్రజలై యుందురు కావున మీరు వారి మధ్య నుండి బయలు వెడలి ప్రత్యేకముగా ఉండుడి; అపవిత్రమైన దానిని ముట్టకుడని ప్రభువు చెప్పుచున్నారు; మరియు నేను మిమ్మును చేర్చు కొందును, మీకు తండ్రినై యుందును, మీరు నాకు కుమారులును కుమార్తెలునై యుందురని సర్వశక్తి గల ప్రభువు చెప్పుచున్నారు" (2కొరింథీ 6:14-18).

నీ తలిదండ్రుల అభీష్టమును బట్టి నీకు పెండ్లియగుచున్నను, నీవు వివాహమాడబోయే వ్యక్తిని అర్థం చేసికొనే వరకు కనిపెట్టుట మంచిది. ఆ వ్యక్తిని అర్థం చేసికొనడం నీకు వీలు కాకపోతే క్రీస్తు సంఘ సభ్యుల నుండి సహాయం కోరుట మంచిది. నీవు పెండ్లాడగోరే వ్యక్తి క్రీస్తు సంఘ సభ్యుడు, సభ్యురాలు కాకపోతే వివాహ మాడవద్దు. క్రైస్తవేతరులను పెండ్లాడిన వారిలో ఎక్కువ మంది సంఘమునుండి దూరమైపోతారు. తద్వారా నిత్య నాశనంలోకి వెళ్తారు.

మూడవదిగా, ఇంతకుమునుపే పెండ్లి చేసికొన్న వ్యక్తిని పెండ్లాడ గోరవద్దు. ఏలయనగా ఆ వ్యక్తికి ముందు జరిగిన పెళ్లి ఎందుకు విఫలమయ్యిందో సరియైన కారణాలు నీకు దొరకక పోవచ్చును. అందువలన ఇంతకుమునుపు ఒకసారి పెండ్లాడిన వ్యక్తిని పెండ్లి చేసికొనక పోవడం క్షేమం, మేలు. యేసు ఇట్లనుచున్నారు : "వ్యభిచారము నిమిత్తము తప్ప తన భార్యను విడనాడి మరియొకతెను పెండ్లి చేసుకొను వాడు వ్యభిచారము చేయుచున్నాడనియు, విడనాడబడిన దానిని పెండ్లి చేసికొను వాడు వ్యభిచారము చేయుచున్నాడనియు మీతో చెప్పుచున్నాను" (మత్త 19:9).

నాల్గవదిగా, జీవితాంతము వరకు పెండ్లాడుము (Marry for Life). ఈ పెళ్లి జీవితం బాగో లేకపోతే ఇంకోపెళ్లి చేసికోవచ్చును, విడాకులిచ్చేయ వచ్చును అనేతలంపుతో పెండ్లాడవద్దు. "మరణం

మనలను వేరుపరచు వరకు" అనే భావంతో పెండ్లి చేసికొనుము. అపొ.పౌలు ఇట్లను చున్నాడు : "సహోదరులారా, మనుష్యుడు బ్రదికినంత కాలమే ధర్మశాస్త్ర మతని మీద ప్రభుత్వము చేయుచున్నదని మీకు తెలియదా?...... భర్తగల స్త్రీ భర్త బ్రదికియున్నంత వరకే ధర్మశాస్త్రము వలన అతనికి బద్ధురాలు గాని భర్త చనిపోయిన యెడల భర్త విషయమైన ధర్మశాస్త్రము నుండి ఆమె విడుదల పొందును. కాబట్టి భర్త బ్రదికి యుండగా ఆమె వేరొక పురుషుని చేరిన యెడల వ్యభిచారిణి యనబడును గాని, భర్తచనిపోయిన యెడల ఆమె దర్మశాస్త్రము నుండి విడుదల పొందెను గనుక వేరొక పురుషుని వివాహము చేసికొనినను వ్యభిచారిని కాకపోవును" (రోమా 7:1-3). వివాహమాడిన వారిని మరణం వేరు చేసే వరకు దంపతులుగానే యుండాలనేది ధర్మశాస్త్రము యొక్క విధి. అయితే దంపతులలో ఎవరైనా చనిపోతే బ్రదికి యున్న వ్యక్తి వివాహమాడ వచ్చును. ఈ వ్యక్తి వివాహమాడే వ్యక్తికి ఇంతకు మునుపు పెండ్లి జరుగ కుండానైనా యుండాలి, లేదా ఆవ్యక్తి యొక్క సహచారి కూడ మరణించి అయినా యుండాలి. ఇదే సత్యమును క్రీస్తు యొక్క క్రొత్త నిబంధన కూడ బోధించు చున్నది.

అయిదవదిగా, పెండ్లాడిన తరువాత నీ భార్యకు లేక భర్తకు నమ్మకముగా జీవించాలి. నీవు జారత్వమును జరిగించిన యెడల వివాహ ప్రమాణములను భంగపరిచినట్లుగును. అట్టి సందర్భాల్లో నీవు క్షమాపణ కోరవలెను. లేదా నీ భాగస్వామి విడాకులిచ్చిన యెడల జీవితాంతము వరకు తిరిగి పెండ్లాడరాదు. జారత్వమును లేఖనములు ఖండించు చున్నవి (1 కొరింథీ 6:9-10).

ఆరవదిగా, మీ బిడ్డలను క్రైస్తవ గృహ వాతావరణములో పెంచ వలెను. దేవుని గూర్చి, క్రీస్తును గూర్చి వారికి బోధిస్తు పెద్ద వారైనప్పడు వారు కూడ క్రైస్తవులనే భాగస్వామ్యులుగా ఎంచుకొనునట్లు సహాయ పడవలెను. వారి యెదుట, వారనుకరించునట్లు మంచి మాదిరి నెలకొల్ప వలెను. పేతురు చెప్పిన ఈ మాటలను జ్ఞాపకముంచుకొనుము: "అయితే

మీరు చీకటిలో నుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి మిమ్మును పిలిచిన వాని గుణాతి శయములను ప్రచురము చేయు నిమిత్తము ఏర్పరచబడిన వంశమును రాజులైన యాజక సమూహమును పరిశుద్ధ జనమును దేవుని సొత్తయిన ప్రజలునై యున్నారు. ఒకప్పడు ప్రజగా ఉండక యిప్పడు దేవుని ప్రజయైతిరి. ఒకప్పడు కనికరింపబడక యిప్పడు కనికరింపబడిన వారైతిరి. ప్రియులారా, మీరు పరదేశులును యాత్రికులునై యున్నారు గనుక ఆత్మకు విరోధముగా పోరాడు శరీరాశలను విసర్జించి అన్యజనులు మిమ్మును ఏ విషయములలో దుర్మార్గులని దూషింతురో, ఆ విషయములలో వారు మీ సత్‌క్రియలను చూచి వాటిని బట్టి దర్శన దినమున దేవుని మహిమ పరచునట్లు వారి మధ్యను మంచి ప్రవర్తన గలవారై యుండవలెనని మిమ్మును బతిమాలు కొనుచున్నాను" (1పేతురు 2:9-12).

ఇంకా అనేక సలహాల నీయవచ్చునుగాని, వివాహాన్ని గూర్చి ఆలోచించునప్పడు పై సంగతులను మనస్కరించుము. నీవు క్రైస్తవ వివాహము జరిపించు కొందువనియు, అది నీకు, నీ భాగస్వామికి, మీకు కలుగబోయే సంతానమునకు అత్యంతానందము నొసగుననియు నా ప్రార్థనయై యున్నది.

- జె.సి. ఛోట్


క్రీస్తు సంఘములు సమర్పించుచున్న
'సత్యవాణి' టి.వి. కార్యక్రమమును ప్రతి శనివారం
ఉ॥ 6:30 నుండి 7:00 వరకు
**తేజ** ఛానల్‌లో చూడండి.

## శిష్యుని లక్షణములు

(Signs of a Disciple)

యేసుక్రీస్తు తన శిష్యులకు "మీరు సమస్త జనములను నాకు శిష్యులనుగా చేయుడి" యని ఆజ్ఞాపించెను (మత్త 28:19) ఆయన శిష్యులైన వారు గుర్తుపట్ట బడాలి. క్రీస్తు యొక్క నిజమైన శిష్యులను ఈనాడు ఏలాగు మనం గుర్తించగలము? వారి కున్న ప్రత్యేక లక్షణము లేమిటి?

సహోదర ప్రేమ వారి ప్రత్యేక లక్షణమని కొందరు చెప్తారు. యోహాను 13:34-35ని బట్టి వారట్లుచెబుతారు : "మీరు ఒకరినొకరు ప్రేమింపవలెనని మీకు క్రొత్త ఆజ్ఞఇచ్చుచున్నాను; నేను మిమ్మును ప్రేమించినట్టే మీరును ఒకరినొకరు ప్రేమింపవలెను. మీరు ఒకని యెడల ఒకడు ప్రేమగలవారైన యెడల దీనిబట్టి మీరు నా శిష్యులని అందరు తెలిసికొందురని" ప్రభువు వారికి చెప్పెను, క్రీస్తు శిష్యులు ఒండొరుల యెడల నిష్కపటమైన ప్రేమను తప్పక ప్రదర్శించాలి. యిందులో వెనుకబడితే శిష్యత్వములో వెనుక బడినట్లే.

అయితే ప్రేమ ఒక్కటి మాత్రమే శిష్యత్వపు లక్షణమని క్రీస్తు వారు చెప్పలేదు. లేఖనములలో మరికొన్ని శిష్యత్వపు లక్షణములు తెలియ జేయబడ్డాయి.

"మీరు నా వాక్యమందు నిలిచిన వారైతే నిజముగా నాకు శిష్యులై యుందురని" యోహాను 8:31లో ప్రభువు పల్కెను. ప్రేమను పాటించడం ఎంత ముఖ్యమో, వాక్యమందు నిలిచి యుండడం కూడ అంతే ప్రాముఖ్యము. ప్రేమ అనేక పాపములను కప్పను. అయితే వాక్యమందు నిలిచి యుండడానికి బదులుగా అది యుండదు. ఏలయనగా "క్రీస్తు బోధయందు నిలిచి యుండక దానిని విడిచి ముందునకు సాగు ప్రతివాడును దేవుని అంగీకరింపనివాడు" (2 యోహాను : 9).

"మీరు బహుగా ఫలించుట వలన నా తండ్రి మహిమ పరచబడును; ఇందువలన మీరునా శిష్యులగుదురు" అని ప్రభువు చెప్పెను (యోహాను 15:8). ప్రేమ వలె, ఫలములు ఫలించుట కూడ శిష్యత్వపు నిజ లక్షణమై యున్నది. ప్రతి లక్షణము ప్రాముఖ్యమైనదే. ఒకడు యేసును ప్రగాఢంగా ప్రేమింపవచ్చును గాని అతడు వాక్యములో నిలిచి

యుండక, ఫలములు ఫలింపక యున్న యెడల అతడు నిజమైన శిష్యుడు కాదు.

"ఎవడైనను తన సిలువను మోసికొని నన్ను వెంబడింపని యెడల వాడు నా శిష్యుడు కానేరడని" లూకా 14:27లో ప్రభువు చెప్పెను. శిష్యుడైనవాడు శ్రమలను, భారములను, బాధ్యతలను వహించువాడై యుండాలి. ప్రేమగలిగి, వాక్యమందు నిలిచియుండి, ఫలములు ఫలిస్తు శ్రమలను భారములను, బాధ్యతలను వహించని వాడు శిష్యుడు కానేరడు.

మత్తయి 12:48-50లో యేసు తన శిష్యులను గూర్చి చెబుతు ఆత్మీయముగా వారే తన తల్లియు, సహోదరులును అని చెప్పెను. పరలోకమందున్న నా తండ్రి చిత్తము చొప్పున చేయువాడే నా సహోదరుడు, నా తల్లియునని ఆయన చెప్పెను. ప్రభువు యొక్క శిష్యుడు ప్రతి సత్కార్యమును చేయుటకు పూర్ణముగా సిద్ధపడిన వాడు (2తిమోతి 3:17).

(VOT)

## ఆలోచించు

పాత నిబంధనలో యాజకులము, యాజకధర్మాన్ని దేవుడే నియమించారు. గాని దేవుడుభూమిమీద అవతరించినప్పుడు వారే ఆయనను పట్టుకొని చంపించారు! మొదటి శతాబ్దములో యాజకులే పలుకుబడి గలిగిన రాజకీయవేత్తలు. క్రీస్తు సంఘస్థులను, క్రైస్తవులను బంధించి, హింసించి, చంపించుటలో ఆనాడు యూదుల యాజకులే ప్రధాన పాత్ర వహించారు. అదంతా దేవుని నామాన్నే జరిగించారు! గాని హింస గొప్పగా ప్రబలి యున్న ఆ రోజులలోనే "యాజకులలో అనేకులు విశ్వాసమునకు లోబడిరి" యనే మాటలలో గొప్ప శక్తి, ఆదరణ కనబడుట లేదా? (అపో.కా. 6:7).

నీకు మరణం సంభవించేటంత హింసను ఎదుర్కొన వచ్చును. గాని ధైర్యము తెచ్చుకొనుము. నిన్ను హింసించే వారినే మార్చే శక్తి క్రీస్తు సువార్తలో యున్నది (రోమా 1:16).

గమనిక : సత్యవాక్కు వలయు వారు సంవత్సరమునకు
30/- రూ॥లు చందా విధిగా పంపించవలయును.
Satya Vani, P.O. Box - 80, Kakinada - 533 001.

ముగిసెను. సువార్తికుల సదస్సుకు హాజరైన వారందరికీ స్థానిక క్రీస్తు సంఘము చక్కటి భోజన పానాదులు అనుగ్రహించిరి. సోదరులు వై.ప్రభుదాస్ గారు కొమ్మరలోను పరిసర ప్రాంతములలోను సువార్త చాటుచున్నారు. సువార్తికుల సదస్సు అనంతరం 9మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

2003 ఏప్రియల్ 16, 17 తేదీలలో రాజమండ్రి గణేశ్ నగర్ క్రీస్తు సంఘము బహిరంగ సువార్త కూటములు ప్రత్యేక బైబిలు తరగతులు నిర్వహించిరి. కోరుకొండ రోడ్‌లో ట్రిప్స్ స్కూల్ వద్ద గల విశాల ఆవరణలో రాత్రివేళ సువార్త కూటములు నిర్వహించబడెను. ప్రతి కూటమునకు మూడు వందలకుపైగా జనం హాజరై దేవుని వాక్యమును వినిరి. ఆ కూటములలో సోదరులు పి. జయపాల్ (దానవాయి పేట), పి. నాగభూషణం (జంగారెడ్డి గూడెం) మరియు జాషువా గూటం గార్లు వాక్యపరిచర్య చేసిరి.

రాజమండ్రిలో యున్న పలు స్థానిక క్రీస్తు సంఘములు, సువార్తికులు ఈ కూటములలో పాల్గొని వాటిని జయప్రదముగా వించిరి. గణేష్‌నగర్ క్రీస్తు సంఘము వచ్చిన వారందరికీ మంచి ఏర్పాట్లు చేసిరి. గణేష్ సంఘ సువార్తికులు సోదరులు యమ్. కిరణ్ కుమార్ గారు ఈ కూటముల కొరకై నిర్విరామ కృషి చేసిరి, సమర్ధవంతముగా నడిపించిరి. ఈ రెండు రోజుల కూటములలో 11 మంది క్రీస్తు నందు విశ్వసించి బాప్తిస్మము పొందిరి.

ఏప్రియల్ 19వ తేదీ శనివారం అమలాపురం కరక్కాయి పేట కోలనీలో నిర్మించినబడిన క్రీస్తు సంఘ ఆలయమును, దానికి జతచేసి నిర్మించబడిన సువార్తికుని గృహవసతిని జాషువా గూటం గారు విడివిడిగా రిబ్బను కత్తిరించి ప్రభువు పని కొరకు ప్రతిష్ఠించిరి. తదుపరి జరిగిన కూటమునకు కరక్కాయి పేటలోనే పనిచేయు చున్న సోదరులు వి. రాజ్‌కుమార్ గారు అధ్యక్షత వహించిరి. జాషువాగారు వాక్యపరిచర్య చేసిరి. స్థానిక సంఘము కొందరికి బైబిళ్లు ఉచితముగా అందజేసిరి. వి.జె.ఫ్రాన్సిస్ గారి ప్రార్థనతో కూటము అంతమాయెను. ఇద్దరు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. కరక్కాయి పేట కోలనీలోను, నేదునూరులోను సోదరులు బూల రవిశాస్త్రీ గారు సువార్త చాటుచున్నారు.

2003 ఏప్రియల్ 23, 24, 25 తేదిలలో తూర్పుగోదావరి జిల్లా

రఘుదేవపురంలోని క్రీస్తు సంఘము సత్యసువార్త సభలు నిర్వహించిరి. ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రము కూడ కూటములు జరిగెను. ఈ సభలలో సోదరులు వి. సుదర్శనరావ్ (రాజమండ్రి), పి. సంజీవరావ్ (పెద్దాపురం), జె. మణికుమార్ (పెద్దాపురం), యం. ప్రేమ కుమార్ (చదలాడ) మరియు జాషువా గూటం గారు వాక్యపరిచర్య చేసిరి. స్థానిక సువార్తికులు సోదరులు యమ్. కృపానందం గారు సమయానుకూలముగా సంఘమునకు తగు హెచ్చరిక లిస్తు యుండిరి. కూటములు ఆఖరి రోజున సోదరులు పి. అబ్రాహాము (విజయవాడ), బి. ధర్మరాజు (నల్లగొండ) గార్లు కూడ సువార్త కూటములలో పాల్గొనిరి. జి. శేషు అనుచిన్న బాలుడు 100కు పైగా ఆత్మీయ గీతములను అనర్గళంగా పాడి వినిపిస్తు సభికులను ఆశ్చర్యపరచెను. సోదరులు కృపానందం గారు చేసిన చక్కటి కృషి ఫలితముగా ఈ మూడు రోజుల కూటములు జయప్రదముగా, దేవుని నామమునకు ఘనత తెచ్చునవిగా నిర్వహించబడెను.

❄ ❄ ❄

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02

From:
SATYA VAKKU
P.O. Box 80,
Kakinada - 533 001

To

Edited & published by Joshua Gootam Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada-533 004.